క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఐఎస్ఓ ప్రతినిధులు

ఉరవకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఉదయం ఐఎస్ఓ (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్‌జేషన్) ప్రతినిధులు సింగన్న, ప్రసాద్ పరిశీలించారు. కార్యాలయంలో పనులు జరుగుతున్న తీరు, అందులో పారదర్శకత, ఉద్యోగుల సమయపాలన, ప్రజల అవసరాలపై స్పందిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. తహసీల్దార్ మహబూబ్‌బాషా, డిప్యూటీ తహసీల్దార్లు హరిప్రసాద్, నరేష్, సీనియర్ అసిస్టెంట్ షెక్షావలి, వంశీకృష్ణ, వీఆర్ఓ కృష్ణకీర్తి, జూనియర్ అసిస్టెంట్ నాగముని పాల్గొన్నారు.

కాళ్లు, చేతివేళ్లకు పుండ్లు కాకుండా జాగ్రత్త పడాలి



పుండ్లు కాకుండా శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూడేరు: కుష్ఠు వ్యాధిగ్రస్తులు కాళ్లు, చేతివేళ్లకు పండ్లు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ (డీపీఎంఓ) తిప్పేస్వామి హెచ్చరించారు. సోమవారం మండలంలోని లెప్రసీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. పుండ్లు కాకుండా కాళ్లు, చేతి వేళ్లను ఎలా శుభ్రం చేసుకోవాలనేదానిపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎం భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ భూమిపై వివాదం



ఇరువర్గాల మధ్య జరుగుతున్న వాగ్వాదం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డులోని వక్ఫ్ వివాదాస్పద భూమిలో సోమవారం ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ భూమిపై హైకోర్టులో కేసు నడుస్తోంది. దమ్మేహయాత్ పీర్ల చావిడి ఇనాం భూమిగా గతంలోనే అధికారికంగా వక్ఫ్ ట్రిబ్యునల్ తీర్పు చెప్పిందని, ముజావర్ల బతుకుతెరువుకు భూమి కావాలని ఇనాయత్, మహబూబ్‌బాష తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జేసీబీతో కేబీ ప్యాలెస్ రోడ్డులోని వివాదాస్పద వక్ఫ్ భూమిని చదును చేయిస్తుండగా అయూబ్‌ఖాన్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలి

కూడేరు: రీసర్వే జరిగిన గ్రామాల్లోని ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు మళ్లీ ఈ-క్రాప్ చేయించుకోవాలని ఏఓ విజయ కుమార్ తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని ముద్దలాపురంలో చేస్తున్న పంటల నమోదును ఏఓ తనిఖీ చేశారు. ఏఈఓ శైలజ, ఎంపీఈఓలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



డీహీరేహాళ్ కేజీబీవీని తనిఖీ చేస్తున్న జడ్జి రమ్య

రాయదుర్గం (డీ హీరేహాళ్): విద్యార్థినులకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి ఎమ్.రమ్య తెలిపారు. సోమవారం డీ హీరేహాళ్, రాయదుర్గం పట్టణంలోని కేజీబీవీని జడ్జి సందర్శించారు. భోజన నాణ్యత, మౌలిక సౌకర్యాలపై తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఓ లు శిల్ప, వెంకటలక్ష్మితో మాట్లాడి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై ఎంతమేరకు అవగాహన కల్పించారని అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, పలువురు అడ్వొకేట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి

శెట్టూరు: మండలంలోని కరిడిపల్లిలో గుండెపోటుతో మృతి చెందిన అమర వన్నూరప్పకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి స్థానిక నాయకులతో కలిసి సోమవారం నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. వన్నూరప్ప పార్టీ అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, ఎమ్మెస్ రాయుడు, శివ, బద్రి, నారా యణ, లక్ష్మణమూర్తి, లింగారెడ్డి, వీరారెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పొడిబారిపోతున్న కళ్లు

- ఆస్పత్రుల్లో పెరుగుతున్న కేసులు
- సెల్‌ఫోన్, కంప్యూటర్ ఎక్కువసేపు చూడడమే కారణం
- జీవనశైలి మార్పుతో కొత్త సమస్యలు



రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: మారుతున్న కాలానుగుణంగా..జీవన శైలిలో మార్పు కారణంగా కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉండాల్సిందే.. ఏ కాస్త సమయం దొరికితే చాలు.. మితిమీరి యాన్‌డ్రాయిడ్ మొబైళ్లు వినియోగిస్తున్నారు. కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లు ఎక్కువ సమయం చూస్తున్నారు. దీంతో కళ్ల సమస్యలు అధికంగా వస్తున్నాయి. నిద్రలేమి వేధిస్తోంది. కళ్లు పొడిబారిపోతున్నాయి. కళ్ల సమస్యలతో ఆస్పత్రుల చుట్టూ తిరిగే వారి సంఖ్య అధికమైంది.

రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో కంటి సమస్యలతో నిత్యం 40 నుంచి 50 మంది వస్తున్నారు. అందులో 8 నుంచి 10 శాతం మంది కళ్లు పొడిబారిన కేసులే నమోదు కావడం విశేషం. కణేకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ సీహెచ్‌సీలతో పాటు అర్బన్, మండల పీహెచ్‌సీల్లోనూ ఈ సమస్యలను వైద్యులు అధికంగా గుర్తిస్తున్నారు. చూడడానికి ఇది చిన్నదే అనిపించినా నిర్లక్ష్యం చేస్తే కళ్లకే ప్రమాదమని వైద్యులు చెప్తున్నారు.

లక్షణాలు ఎలా ఉంటాయంటే..

కళ్లు పొడిబారి పోవడం వల్ల నలక పడినట్టు అనిపిస్తుంది. కళ్లు గుచ్చుకుంటుండడంతో తరచుగా కళ్లు నలుపుతుంటారు. మరికొందరికి కళ్ల నుంచి విపరీతంగా నీరు కారుతుంది. చేత్తో కళ్లు తుడుస్తుంటారు. ఇలా చేయడం వల్ల సమస్య మరింత జఠిలం అవుతుంది. ఒక్కోసారి కంటిలోని నరాలు దెబ్బతింటాయి. ఈ కారణంగా కళ్లు నలపడం, రుద్దడం లాంటివి చేయకూడదు. ఇంకొందరు కంటిలో మట్టిపడిందని నాటు వైద్యులను ఆశ్రయిస్తారు. నాలుకతో మట్టి తీయించడం చేస్తారు. ఇది చాలా ప్రమాదం.

కళ్లు పొడిబారితే ఏం చేయాలంటే..

- చల్లటి నీటిని కళ్లమీద చల్లుకోవాలి. దీని వల్ల కంటి రెప్పలో రక్త ప్రసరణ పెరుగుతుంది. కళ్లు ఎనర్జిటిక్ అవుతాయి.
- కన్నుగుడ్డు అటుఇటూ గుండ్రంగా తిప్పాలి.
- చల్లటి శుభ్రమైన గుడ్డను కళ్ల పై ఉంచుకోవాలి.
- కంప్యూటర్ ముందునుంచి కానీ, మొబైల్ ఫోన్ నుంచి కానీ ప్రతి 20 నిమిషాలకోసారి బ్రేక్ తీసుకోవాలి. 20 అడుగుల దూరం నుంచి దృశ్యం చూసే అలవాటు చేసుకోవాలి. దీన్ని ట్వంటీ ట్వంటీ సిస్టం అంటారు. దీని వల్ల కంటిపై ఒత్తిడి తగ్గుతుంది. ఉపశమనం దొరుకుతుంది.
- సమస్య ఎక్కువగా వేధిస్తుంటే నేత్ర వైద్య నిపుణుల సలహా ప్రకారం లూబ్రికెంట్ డ్రాప్స్ వాడాలి.
- షుగర్ వ్యాధిగ్రస్తులైతే ఆహార నియమాలను పాటిస్తూ, క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలి.
- వైద్యుల సలహా మేరకు యాంటీ రిఫ్లక్టెడ్ కోటింగ్ కలిగిన కళ్లజోళ్లు వాడాలి.

కళ్లపై శ్రద్ధ వహించాలి



కళ్లపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి. చర్మం, నోరు పొడిబారినట్టే కళ్లు కూడా డ్రై అవుతాయి. గతంలో ఈ సమస్య చాలా అరుదుగా కనిపించేది. ప్రస్తుతం ప్రతి పది మందిలో ఆరుగురికి ఈ సమస్య ఉన్నట్లు గుర్తించాం. కారణం సెల్‌ఫోన్, కంప్యూటర్ ఇతర గాడ్జెట్లు వాడడం అధికమైంది. రేడియేషన్‌తోనూ ఈ సమస్యగా ఎక్కువగా కనిపిస్తోంది. కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం. నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ప్రతి ఆరు నెలల కోసారి తప్పక కంటి పరీక్షలు చేయించుకోవాలి. వీలైన మేరకు మొబైల్, కంప్యూటర్ వినియోగానికి దూరంగా ఉండాలి.

– మోమిన్ ఇబ్రహీం, కంటి నిపుణులు, రాయదుర్గం

సర్పంచులదే పంచాయతీల అభివృద్ధి బాధ్యత

- ఉరవకొండ ఎంపీడీఓ సుబ్బరాజు



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

ఉరవకొండ: పంచాయతీలను అభివృద్ధి చేసే బాధ్యత సర్పంచులదేనని ఎంపీడీఓ సుబ్బరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ పరిధిలో జీపీడీపీ, పారిశుధ్యం, వీధిలైట్లు నిర్వహణతో పాటు మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలపై మూడు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ నరసింహులు మాట్లాడుతూ గ్రామ కార్యదర్శులు, సర్పంచులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ జయరాములు, విస్తరణ అధికారి చంద్రమౌళి ఉరవకొండ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ పాల్గొన్నారు.

శెట్టూరు: గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసే బాధ్యత సర్పంచులదేనని ఈఓఆర్డీ రఘురాంరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ప్రారంభించారు.సర్పంచ్‌లు విరూపాక్షి గౌడ్, ఈ రన్న, సత్యనారాయణ రెడ్డి, భారతి, లక్ష్మీదేవి, పా లా క్షి, నాగరాజు, చిట్టమ్మ, గంగన్న, కార్యదర్శులు బమ్మశంకర్, వ్యాసరావు, మంజుళ, తిప్పేస్వామి పాల్గొన్నా రు.

పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచండి

కణేకల్లు: గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచేలా సర్పంచులు కృషి చేయాలని ఈఓఆర్డీ గూడెన్న పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

వజ్రకరూరు: పంచాయతీలను అభివృద్ధి చేసుకోవడంతోపాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల అడ్మినిస్ట్రేషన్, శానిటేషన్, వీధిదీపాల ఏర్పాటు, పంచాయతీల అభివృద్ధి తదితర అంశాలపై సర్పం చులు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సదాశివ, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలపై సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచులు, కార్యదర్శులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ట్రైనర్లు మురళి, పావని, రఘు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు, వీధిలైట్లు, చెత్త నుంచి సంపద తయారీపై సర్పంచులు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ షకీలాబేగం సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజుల శిక్షణ ఏర్పాటు చేశారు. ఈఓపీఆర్డీ దాస్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టండి

రాయదుర్గం: తుంగభద్ర జలాశయంలో 19వ గేట్ కొట్టుకుపోయి నీరంతా వృథాగా పోతోందని, దీంతో సాగు, తాగునీటిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. జలాశయంలో ఎక్కువ నీటిని నిలుపుకునేలా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గేటు అమర్చే విషయంలో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. గేట్లు బాగున్నాయంటూ నివేదికలు ఇచ్చారేగానీ చైన్లను పరిశీలించక పోవడం దారుణమని మండిపడ్డారు. వర్షాలు సమృద్ధిగా కురిసి మళ్లీ అవే నీరు జలాశయంలోకి చేరేలా దేవుడిని ప్రార్థిస్తామన్నారు. ఇలాంటి విపత్తు మునుపెన్నడూ చూడలేదన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అభద్రత భావానికి గురికాకుండా ఉండాలని కోరారు. అన్ని విషయాల్లోనూ వైఎస్సార్‌సీపీ వెన్నంటే నిలిచి ఉంటుందని భరోసా కల్పించారు. ఇందులో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

జలాభిషేకం



కలశాన్ని తీసుకొస్తున్న గ్రామస్తులు

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లులోని శంభులింగేశ్వరస్వామికి వర్షం కురవాలని 1111 బిందెలతో జలాభిషేకం చేశారు. ముందుగా గ్రామంలోని బొడ్రాయికి 108 బిందెల నీటితో అభిషేకం చేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న స్వస్థ రాయదుర్గం టీమ్



ర్యాలీ చేస్తున్న స్వస్థ రాయదుర్గం టీమ్

రాయదుర్గంటౌన్: పెళ్లి నిశ్చయమై ఈ నెల 25న జరగనున్న బాల్య వివాహాన్ని 'స్వచ్ఛ రాయదుర్గం స్వస్థ రాయదుర్గం' టీమ్ సభ్యులు బాల్య వివాహాన్ని సోమవారం అడ్డుకున్నారు. పట్టణంలోని నాల్గో వార్డులోని 17 ఏళ్ల బాలుడు గణేష్ ఇంటికి స్వస్థ రాయదుర్గం టీమ్ వైద్యాధికారి రమేష్, ఆరోగ్య బోధకుడు లక్ష్మీనారాయణ, మహిళా పోలీస్ అశ్విని తదితరులు వెళ్లి, అతని తల్లిదండ్రులతో మాట్లాడారు. గణేష్‌కు కర్ణాటకలోని సిద్దాపురానికి చెందిన 16 ఏళ్ల అంబికతో పెళ్లి నిశ్చయమైంది. ఈ నెల 25న వివాహ ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న స్వస్థ టీమ్.. బాలుడి ఇంటికి చేరుకుని బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఆరోగ్యపర్యవేక్షకురాలు శాంతకుమారి, హెడ్ సెక్రటరీ మమత, ప్రమీల, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని మలయనూరు ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు అరికడదాం- ఆడబిడ్డలను కాపాడుదాం అనే అంశంపై కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సీడీపీఓ వనజా అక్కమ్మ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.ఆర్డీటీ ఏటీఎల్ ఆదినారాయణ, సూపర్ వైజర్ సుశీలమ్మ ,హెచ్‌ఎం బషీర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు గోవర్ధన్, జిల్లా సహాయ కార్యదర్శి కొట్రేష్‌లు హాజరై జెండా ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అభిషేక్, మధు, భాను, వీరేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ 89వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు గోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ ఉపాధ్యక్షుడు నవీన్, ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ స్రవంతి, పట్టణ కార్యదర్శి హర్షవర్ధన్, సహాయ కార్యదర్శి అజయ్ పాల్గొన్నారు.

ఉరవకొండలో..

ఉరవకొండ: అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో మొదట ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చందు, మండలాధ్యక్షుడు ఎస్ఎం హారూన్‌రషీద్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికుడు వెంకటేశులుకు ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థికసాయం ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ సోమవారం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ సురేష్, కార్యదర్శి హరి, లోకేష్, తిప్పేస్వామి, రఘు, రాజు పాల్గొన్నారు.

ఓఎంసీలో సీజ్ చేసిన ఇనుప ఖనిజం దోపిడీ చేస్తున్నారు

- బీజేపీ నాయకుడు కాపు

రాయదుర్గం: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాయదుర్గం నియోజకవర్గంలో అవినీతి పెచ్చుమీరిపోయిందని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం త పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)లో సీబీఐ సీజ్ చేసిన ఇనుప ఖనిజం గత ప్రభుత్వ హయాంలోనే దోపిడీ జరిగిందంటూ ఇటీవల కొన్ని పత్రికల్లో అబద్ధపు రాతలు రాశారన్నారు. అప్పట్లోనే దోపిడీ జరిగిందంటూ ముందే ఓ అబద్ధాన్ని సృష్టించి...ప్రస్తుతం వారి దోపిడీకి లైన్ క్లియర్ చేసుకున్నారని ధ్వజమెత్తారు. గత మూడు రోజులుగా కొందరు రాత్రి వేళ ఓఎంసీలో సీజ్ చేసిన మెటీరియల్‌ను ఇష్టారాజ్యంగా తరలిస్తూ సమీప ఫ్యాక్టరీల్లో అమ్మేస్తున్నారని తెలిపారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొందరు ఇలాంటి పనులకు పూనుకున్నారని విమర్శించారు. ఈ సంపద ఎవరికి చేరుతోందో? దీనికి వెనుక ఉండే కారకులు ఎవరో తేల్చుతామన్నారు. ఈ దోపిడీ వ్యవహారంపై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసి రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామన్నారు. కూటమిలో బీజేపీ కూడా ఉండడంతో చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదన్నారు. అందుకే తాము కూడా సీరియస్‌గా తీసుకుని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అంబేడ్కర్ జోలికి వస్తే సహించం



ఉరవకొండలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఉరవకొండ: అంబేడ్కర్ విగ్రహాల ధ్వంసానికి పాల్పడితే సహించేదిలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక కవితా హోటల్ సర్కిల్ వద్ద నుంచి క్లాక్‌టవర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అనంతరం పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ విభాగం జిల్లా నాయకులు బసవరాజు మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబన్న, ఈడిగ ప్రసాద్, బళ్లారి ఆసీఫ్, వడ్డే ఆంజనేయులు, జేసీబీ రామకృష్ణ, జోగి భీమా, కాసుల ఆంజనేయప్రసాద్, జోగిహనుమంతు, గంధోడి మారేష్, కురుబ ప్రకాష్, కాసుల అంజి, ఆరెరాజ, చిన్నా, ఓబుళేసు, రాంరెడ్డి, శర్మాస్, అమర్నాథ్, గోపాల్, శంకరయ్య, రమేష్, హనమంది, వెంకటేష్, మల్లికార్జున, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తు తన సొంత జిల్లాకు బదిలీ అయిన జీవీ సుబ్బరాజును ఎంపీపీ నరసింహులు, సిబ్బంది సోమవారం సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీడీఓగా సుబ్బరాజు ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేశారన్నారు. సర్పంచులు, కార్యదర్శులను సమన్వయం చేసుకొని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఏఓ జయరాములు, విస్తరణ అధికారి చంద్రమౌళి, ఏపీఓ విమల తదితరులు ఉన్నారు.

కణేకల్లు ఎంపీడీఓగా శ్రీనివాసులు



కణేకల్లు: కణేకల్లు ఎంపీడీఓగా శ్రీనివాసులు సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈయన అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లారు. అనంతరం సొంత జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈఓఆర్డీ గూడెన్న, సిబ్బంది హనుమంతు, జావేద్, భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపీడీఓగా నరసింహమూర్తి



గుమ్మఘట్ట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నరసింహమూర్తిసో మ వారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న గౌరిదేవి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బొమ్మనహాళ్ ఎంపీడీఓగా షకీలాబేగం



బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ ఎంపీడీఓగా షకీలాబేగం సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కడప జిల్లాకు బదిలీ అయిన ఆమె.. తాజాగా తిరిగి సొంత జిల్లాకు వచ్చారు. బొమ్మనహాళ్ మండల ప్రజలకు అందుబాటులో ఉండి ,వారి సమస్యలను పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని షకీలాబేగం తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలతో సుఖవ్యాధుల కట్టడి



కంబదూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటే హెచ్ఐవీ, సుఖవ్యాధులు, టీబీ రాకుండా చూసుకోవచ్చని వైద్యులు మెర్సి జ్ఞానసుధ, ఉమామహేశ్వర్, రాధ తెలిపారు. సోమవారం ఏరియా ఆస్పత్రి, ఐసీటీసీ, మాస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మీకు తెలుసు..? దేశ్యాప్తంగా జరిగే ఇంటెన్సిఫైడ్ రెండు నెలల కార్యక్రమంలో భాగంగా శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత ఏరియా ఆస్పత్రి వద్ద ర్యాలీని వైద్యులు మెర్సి జ్ఞాన సుధ, ఉమామహేశ్వర్, రాధ, మోహన్‌సాయి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, ఎల్‌టీ అల్తాఫ్, డీపీఎంఓ నీలకంఠ, టీబీ యూనిట్ ఎల్‌టీ సురేష్‌బాబు, శశికళ, నర్సింగ్ సూపరింటెండెంట్ రమణమ్మ, హెడ్ నర్స్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని రైడ్స్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ మహేష్ తెలిపారు. సోమవారం ఎయిడ్స్, సుఖవ్యాధులపై రైడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలోని విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ మల్లికార్జున, టీబీ నివారణ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

కంబదూరు: ప్రతి ఒక్క యువతి, యువకుడు హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి ఆసియా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవల్లి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా? అనే కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఎంఈఏ నూర్ మహమ్మద్ , ఎల్‌టీ శృతి, ఏఎన్ఎం అనసూయమ్మ పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులు ఉంటాయని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ అనిల్, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

కంబదూరు: మండలంలో నెలకొన్న ఎస్సీ,ఎస్టీల భూ సమస్యలను పరిష్కారించాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘం నాయకులు కోరారు. సోమవారం వారు తహసీల్దార్ బాలకిషన్‌ను కలిసి మండలంలో ఎస్సీ,ఎస్టీలు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై వివరించారు. అనంతరం తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘం మండల అధ్యక్షుడు డాబా రమేష్, నాయకులు నాగరాజు, శివన్న, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వినతుల స్వీకరణ

కంబదూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తహసీల్దార్ బాలకిషన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

విద్యార్థుల ప్రతిభకు పరీక్ష

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల, నార్త్ స్కూల్, గర్ల్స్ హైస్కూల్, మోడల్ స్కూల్‌లో పదో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు సుమారుగా 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్వచ్ఛ భారత్ అభియాన్, క్లీన్ అండ్ గ్రీన్ ఇండియా అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కంబదూరు: మండలంలోని చెర్లోపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో గుట్టుగా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్ఐ అంజనేయులు తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి, ఐదుగురిని అరెస్ట్‌చేసి, వారి నుంచి రూ.37,900 వేల నగదు, అక్కడ ఉన్న 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిర్వాహకుడు ములకనూరు తిమ్మరాజు, మరో 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుందుర్పి: మండలంలోని నిజవళ్లి గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్ఐ వెంకటస్వామి సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. నూతనంగా నిర్మిస్తున్న సచివాలయంలో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రతి ఒక్కరూ ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, కళ్యాణదుర్గం బీజేపీ కన్వీనర్ ముప్పూరి దేవరాజ్ తెలియజేశారు. సోమవారం పట్టణంలోని జూనియర్ కళాశాల విద్యార్థులతో పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.

త్రైత సిద్ధాంతంపై ప్రచారం

బొమ్మనహాళ్: త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతపై ప్రచారం చేశారు. ఉప్పరహాళ్ గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, చందు, విష్ణు, కృష్ణవేణి, సుజిత, ఎల్లమ్మ పాల్గొన్నారు.

సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలని ధర్నా



ఉరవకొండలో ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉరవకొండ: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను రద్దు చేయాలని ఉరవకొండ ఎంఈఓ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ హనుమప్ప, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌బాబు మాట్లాడారు. అనంతరం ఎంఈఓ ఈశ్వరప్పకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాండురంగ, బీసీ ఓబన్న, వేణు, నాగరాజు, రేణుక, రేవతి, చంద్రశేఖర్, అశ్రాఫ్‌ఆలీ, బండయ్య, ఇస్లాంపాల్గొన్నారు.

కుందుర్పి: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ కుందుర్పి ఎమ్మార్సీ భవనం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలియజేశారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, రామకృష్ణ మాట్లాడారు. 117, 128 జీవోల ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేస్తే ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు.